ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు


శ్రీ వెంకటేశ్వర పెరుమాళ్ ఆలయంలో పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే శ్రీగణేష్

రసూల్‌పురా: దేవి శరన్నవ రాత్రి మహోత్సవాల్లో భాగంగా కంటోన్మెంట్ నియోజక వర్గం ఏడవ వార్డు తిరుమలగిరిలో ప్రసిద్ధి చెందిన సెంట్రల్ బట్టి శ్రీ వెంకటేశ్వర పెరుమాళ్ దేవాలయంలో కొలువై ఉన్న అమ్మవారికి కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్ శనివారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంటోన్మెంట్ ప్రజలను చల్లంగా చూడాలని అయురారోగ్యాలను ప్రసాదించాలని ప్రార్థించినట్లు తెలిపారు. అనంతరం ఆలయ కమిటీ నిర్వహించిన అన్నదాన కార్యక్ర మాన్ని ఎమ్మెల్యే ప్రారంభించి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.

15 నుంచి ఉద్యమకారుల పాదయాత్ర


వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అతిథులు

ఉస్మానియా యూనివర్సిటీ: తెలంగాణ ఉద్యమ కారులకు ఇచ్చిన హామీల అమలుకు ఈ నెల 15 నుంచి 29 వరకు పాదయాత్ర నిర్వహించనున్నారు. ఈ మేరకు శనివారం ఆర్ట్స్ కాలేజీ ఎదుట పాదయాత్రకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ నెల 15న ఆదిలాబాద్‌లో ప్రారంభమై 29న ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఎదుట పాదయాత్ర ముగియనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు దాసర్ల శ్రీశైలం శంకర్‌ముదిరాజ్, విద్యాసాగర్, శ్యాం సుందర్, మాజీ కార్పొరేటర్ యాదయ్య, ఆలకుంట కుమార్, గోపాల్‌నాయక్, బొంత వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నేతల ప్రత్యేక పూజలు

అమీర్‌పేట: కాంగ్రెస్ పార్టీ సనత్‌నగర్ ఇన్‌చార్జి కోట నీలిమ అమీర్‌పేట కనకదుర్గ దేవి అమ్మవారిని దర్శించుకున్నారు. దేవీ నవరాత్రి మహోత్సవాలలో బాగంగా మూడో రోజు శనివారం అమ్మవారు గాయత్రీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.ఈ సందర్భంగా జరిగిన పూజల్లో ఆలయ ఈఓ అంబుజ,ఫౌండర్ ట్రస్టీ మల్లికార్జునప్ప,కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షులు శ్రీనివాస్‌రావు, శ్రీనివాస్‌యాదవ్, దీపక్,ఉమారాణి,శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.


బల్కంపేటలో రాజరాజేశ్వరీ దేవిగా అమ్మవారు

బల్కంపేట ఆలయంలో: బల్కంపేట ఎల్లమ్మ ఆలయంలో రాజరాజేశ్వరీ దేవిగా అలంకరించినట్లు ఈఓ కృష్ణ తెలిపారు.

కనకదుర్గ అమ్మవారిని దర్శించుకున్న కోట నీలిమ


నూరు నోములు నోమి...ఉయ్యాలో...


జెక్‌కాలనీ వాసవీ ఇంద్రప్రస్థా అపార్ట్‌మెంట్ వద్ద బతుకమ్మ ఆడుతున్న మహిళలు..

సనత్‌నగర్: రాగీ బిందె దీస్క రమణీ నీళ్లాకు బోతె..రాములోడు ఎదురాయె నమ్మో ఈ వాడలోన...ముత్యాల బిందె దీస్క ముదితా నీళ్లకు బోతె ముద్దు కృష్ణుడెదురాయె నమ్మో ఈ వాడ లోన...అంటూ బతుకమ్మ పాటలతో జెక్‌కాలనీ ప్రత్యేక శోభను సంతరించుకుంటోంది. కాలనీ బతుకమ్మ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో బతుకమ్మ ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. అందులో భాగంగా శనివారం జెక్‌కాలనీ వాసవీ ఇంద్రప్రస్థ అపార్ట్‌మెంట్ వద్ద బతుకమ్మ వేడుకలు జరిగాయి. రంగురంగుల పూలతో అందంగా అలంకరించి తెచ్చిన బతుకమ్మలను ఒక్కచోట పేర్చి ఆడిపాడారు. కార్యక్రమంలో బతుకమ్మ ఉత్సవ కమిటీ అధ్యక్షురాలు చింతిరెడ్డి ప్రభ, ప్రధాన కార్యదర్శి అన్నపూర్ణలతో పాటు ఉత్సవ కమిటీ ప్రతినిధులు భాగ్యలత, లంక హైమావతి, అమరావతి, హరిత, కృష్ణకుమారి, సృజన, శ్రీదేవి, జ్యోతి, రాజ్యలక్ష్మీ, సంధ్య, మాధవి వాణి, స్వప్న, వాణి, మాధవి, విజయ, భ్రమరాంబ, సునీత, పద్మజ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వెంకటస్వామి జయంతి


కాకా చిత్రపటానికి నివాళ్లు అర్పిస్తున్న విద్యార్థులు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో మాజీ కేంద్రమంత్రి దివంగత గుడిసెల వెంకటస్వామి (కాకా) 95వ జయంతిని విద్యార్థులు ఘనంగా జరుపుకున్నారు. శనివారం అంసా ఆధ్వర్యంలో ఆర్ట్స్ కాలేజీ ఎదుట ఏర్పాటు చేసిన కాకా చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళ్లు అర్పించి ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో అంసా ఓయూ అధ్యక్షులు నామా సైదులు, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు వలిగొండ నరసింహ పాల్గొన్నారు.

సికింద్రాబాద్‌లో పైలట్ ప్రాజెక్టు

సర్వే ప్రారంభం

మూడు బృందాలతో వివరాల సేకరణ


పైలట్ సర్వేలో వివరాలు నమోదు చేస్తున్న డిప్యూటీ కమిషనర్ సుభాష్‌రావు

సికింద్రాబాద్: సికింద్రాబాద్ నియోజకవర్గం సీతాఫల్‌మండి డివిజన్ మహ్మద్‌గూడలో శనివారం ఫ్యామిలీ డిజిటల్ కార్డు పైలెట్ ప్రాజెక్టులో భాగంగా ఇంటింటి సర్వే ప్రారంభమైంది. జీహెచ్ఎంసీ, రెవెన్యూ విభాగాల అధికారులు, సిబ్బంది సంయుక్తంగా సర్వేలో పాల్గొని ఇంటింటి వివరాలు సేకరిస్తున్నారు. జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్ డి.సుభాష్‌రావు ఆధ్వర్యంలో అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ సంధార్యాణి, మారేడుపల్లి తహసీల్దార్ భీమయ్యగౌడ్, అర్బన్ కమ్యునిటీ డెవలప్‌మెంట్ ఏపీడీ టి.శ్రీనాథ్ నేతృత్వంలో ఏర్పాటు చేసిన 3 బృందాల ప్రతినిధులు సర్వేలో పాల్గొని పౌరుల వివరాలు సేకరిస్తున్నారు. మూడు బృందాల్లో ముగ్గురు పరిశీలకులను, 20 మంది సిబ్బందిని వివరాల సేకరణ, నమోదు కోసం నియమించారు. పైలట్ ప్రాజెక్టులో భాగంగా మహ్మద్‌గూడ ప్రాంతంలోని 750 గృహాల వివరాలు సేకరిస్తున్నారు. లోగడ ఆశా వర్కర్లు, అర్బన్ కమ్యునిటీ అధికారులు సేకరించిన వివరాల ఆధారంగా ఇంటింటికీ వెళుతున్న అధికారులు సిబ్బంది సేకరించిన వివరాలను నమోదు చేసుకున్నారు. గతంలోని రేషన్‌కార్డు వివరాల ఆధారంగా మృతుల పేర్లు తొలగింపు, కొత్తవారి వివరాల నమోదు చేస్తున్నారు. దీంతోపాటు ఒకే కుటుంబంలో ప్రభుత్వ పథకాలు పొందుతున్న వివరాలు సేకరిస్తున్నారు. ముస్ముందు ఒకే కార్డు ప్రాతిపదికన ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందించేందుకు అత్యంత పకడ్బందీగా వివరాలు సేకరిస్తున్నామని జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్ సుభాష్‌రావు తెలిపారు. ఈ కార్యక్రమంలో పైలట్ ప్రాజెక్టు పరిశీలకులు ఎం.మోహన్‌రెడ్డి, ఎండీ మక్బూల్, ఇస్సాహుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

గాయత్రిదేవి అలంకారంలో మహంకాళి అమ్మవారు




రాంగోపాల్‌పేట్: సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి అమ్మవారి దేవాలయంలో దేవి శరన్నవ రాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. ప్రతి రోజు అమ్మవారు ఒక్కో అలంకారంలో భక్తులకు దర్శనం ఇస్తుండగా వేలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేస్తున్నారు. శనివారం గాయత్రిదేవి అలంకారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. స్థానిక కార్పొరేటర్ చీర సుచిత్ర కుటుంబ సమేతంగా అమ్మవారిని దర్శించుకున్నారు. టీపీసీసీ కార్యదర్శి డాక్టర్ కోట నీలిమ అమ్మవారికి పూజలు నిర్వహించారు. అలాగే భక్తులకు చేపట్టిన ఏర్పాట్ల గురించి ఆమె ఆలయ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు కూడా పాల్గొన్నారు. నవరాత్రుల సందర్భంగా దేవాలయం వద్ద ప్రతి రోజు పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. కార్యక్రమం అనంతరం ఈవో గుత్త మనోహర్ రెడ్డి, ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ సురిటి కామేష్‌లు కళాకారులను ఘనంగా సత్కరించారు.

అన్నపూర్ణదేవిగా రాజరాజేశ్వరీ అమ్మవారు

మోండా కుమ్మరిగూడలోని రాజరాజేశ్వరీ అమ్మవారిని శనివారం అన్నపూర్ణదేవిగా అలంకరించారు. భక్తులు పెద్ద ఎత్తున అమ్మవారికి పూజలు చేశారు. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు వీరలక్ష్మి, ఎస్ఎస్ కుమారి, ప్రభావతి, సత్సంగ్ సభ్యులు విజయలక్ష్మి, రాజేశ్వరి, అరుణ, అన్నపూర్ణలు పాల్గొన్నారు.

ఎన్నికల కోసం త్వరలో కోర్టుకు


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బోర్డు మాజీ సభ్యులు

కంటోన్మెంట్: సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు ఎన్నికల కోసం త్వరలో కోర్టును ఆశ్రయించనున్నట్లు బోర్డు మాజీ ఉపాధ్యక్షులు జక్కుల మహేశ్వర్ రెడ్డి తెలిపారు. శనివారం బోర్డు మాజీ సభ్యులు లోకనాథం, నళిని కిరణ్, అనిత ప్రభాకర్‌లతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 2015 జనవరిలో చివరిసారిగా కంటోన్మెంట్ ఎన్నికలు జరిగాయన్నారు. దాదాపు మూడేళ్లుగా బోర్డులో ప్రజాప్రాతినిధ్యం లేదన్నారు. ఏడాదిన్నర క్రితం ఎన్నికల కోసం నోటిఫికేషన్ వెలువరించి, ప్రక్రియ సగంలోనే ఉండగానే అర్ధంతరంగా నోటిఫికేషన్‌ను ఉపసంహరించుకుందన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ఓటమి భయంతోనే కంటోన్మెంట్ ఎన్నికలు నిర్వహించడం లేదన్నారు. దసరా సెలవులు ముగిసాక తాము ఎన్నికల కోసం హైకోర్టులో పిటిషన్ దాఖలు చేయనున్నట్లు తెలిపారు. జీహెచ్ఎంసీలో విలీనం, నూతన చట్టం రూపకల్పన పేరిట కాలయాపన చేయకుండా ఇప్పటికైనా కేంద్రం ఎన్నికల నిర్వహణకు ముందుకు రావాలని డిమాండ్ చేశారు.

రాష్ట్రం నిధులు ఇవ్వొచ్చు కదా

పదేళ్లుగా కంటోన్మెంట్ అభివృద్ధి గురించి గత ప్రభుత్వం పట్టించుకోలేదని సీఎం రేవంత్ రెడ్డి చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. తమ హయాంలో ఏమేం పనులు చేశామో ప్రజలకు తెలుసన్నారు. ఎస్ఆర్‌డీపీ, జీహెచ్ఎంసీలో కంటోన్మెంట్ విలీన ప్రక్రియలను తుది దశవరకు తీసుకొచ్చింది బీఆర్ఎస్ ప్రభుత్వమేనన్నారు. తీరా పనులు మొదలయ్యే దశలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ నేతలు తమ గొప్పగా చెప్పుకుంటున్నారని అన్నారు.

బతుకమ్మ వేడుకల్లో మంత్రి సీతక్క


గౌరమ్మ పూజలు చేస్తున్న మంత్రి సీతక్క

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో జరిగిన బతుకమ్మ వేడుకల్లో మంత్రి సీతక్క పాల్గొన్నారు. శనివారం పాలన భవనం ఎదుట మూడు ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బతుకమ్మ ఉత్సవాలకు సీతక్క ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి మహిళా ఉద్యోగులతో ఆడిపాడారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మీనారాయణతో పాటు లా ప్రొ. విజయలక్ష్మీ, ప్రొ.లావణ్య మహిళా ఉద్యోగులు అధిక సంఖ్యలో హాజరాయ్యరు.

బంగారు బతుకమ్మ ఉయ్యాలో..


లాలాపేట: బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో.. బంగారు బతుకమ్మ ఉయ్యాలో అంటూ మహిళలందరూ ఆనందంగా ఆడిపాడారు. బతుకమ్మ ఉత్సవాల్లో భాగంగా శనివారం తార్నాక మున్సిపల్ డివిజన్ లాలాపేటలోని పలు అంగన్‌వాడి స్కూల్స్‌లో వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడి టీచర్లు కృపావతి, సంధ్యారాణి, సుజాత, రోజారాణి, స్థానిక మహిళా నాయకురాలు తిరుమల రేణుక, అంగన్‌వాడి సిబ్బంది, స్థానిక మహిళలు పాల్గొన్నారు.

- తార్నాకలోని న్యూ చైతన్య జూనియర్ కళాశాలలో బతుకమ్మ వేడుకలను అట్టహాసంగా నిర్వహించారు. విద్యార్థినీలు అందరూ సాంప్రదాయమైన వస్త్రాల్లో కళాశాలకు హాజరైనారు. రంగు రంగుల పూలతో బతుకమ్మలు పేర్చి ఆడిపాడారు. కార్యక్రమంలో కళాశాల వ్యవస్థాపక చైర్మెన్ ఉదయ్ భాస్కర్ హాజరైనారు. కార్యక్రమంలో డైరెక్టర్ ప్రదీప్ తోట, అనీల్‌కుమార్, మౌనిక, శ్యామ్ తదితరులున్నారు.


లాలాపేటలో బతుకమ్మ ఆడుతున్న అంగన్‌వాడీ టీచర్లు, స్థానిక మహిళలు


బతుకమ్మ ఆడుతున్న తార్నాక న్యూ చైతన్య జూనియర్ కళాశాల విద్యార్థులు

సభ్యత్వ నమోదును వేగవంతం చేయండి


బీజేపీ సభ్యత్వ నమోదు ప్రక్రియలో మర్రి పురురవరెడ్డి..

సనత్‌నగర్: సభ్యత్వ నమోదును మరింత వేగవంతం చేయాలని బీజేపీ రాష్ట్ర యువనేత మర్రి పురురవరెడ్డి అన్నారు. బీజేపీ సనత్‌నగర్ డివిజన్ యువ నాయకుడు వంశీకృష్ణ ఆధ్వర్యంలో స్థానిక నెహ్రూ పార్కు వద్ద జరిగిన సభ్యత్వ నమోదు కార్యక్రమానికి హాజరైన పురురవరెడ్డి పలువురికి సభ్యత్వాలను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్రమోదీ పాలనతో దేశ కీర్తిప్రతిష్టలను పెరగడమే కాకుండా నిరుపేద ప్రజలకు ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి వారి మన్ననలను పొందుతున్నారన్నారు. ఇంటింటికి వెళ్లి బీజేపీ సభ్యత్వ నమోదును వేగవంతం చేసి పార్టీని మరింత బలోపేతం చేసేలా కార్యకర్తలు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు క్రాంతికుమార్,దయానంద్, నర్సింగ్‌రావు,ఆకుల మహేష్, శ్రీనివాస్‌రెడ్డి, సత్యనారాయణ, చందు, అనుదీప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు

శరన్నవరాత్రి వేడుకల సందర్భంగా సనత్‌నగర్, సికింద్రాబాద్, కంటోన్మెంట్ నియోజకవర్గాల్లోని పలు ఆలయాల్లో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కుంకుమార్చనలు, అన్నదాన కార్యక్రమాలు జరిగాయి.


సీతాఫల్‌మండి కనకదుర్గమాత దేవాలయంలో సామూహిక కుంకుమార్చనలు


బీదలబస్తీ రేణుకాఎల్లమ్మ దేవాలయం వద్ద భక్తులకు అన్నప్రసాద వితరణ


మధురానగర్ బంగారు మైసమ్మ దేవాలయంలో ఏసీపీ జైపల్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్ కరుణాకర్‌రెడ్డి


కంటోన్మెంట్‌లో శ్రీ కాళీ దుర్గా దేవి ఆలయంలో పూజలో బోర్డు మాజీ ఉపాధ్యక్షులు జంపన ప్రతాప్ విద్యావతి దంపతులు


దండు మారమ్మ దేవాలయంలో కుంకుమార్చన

బతుకమ్మ వేడుకలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

- ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్


బతుకమ్మ పండుగ ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

బన్సీలాల్‌పేట్: ప్రకృతిని పూజించే గొప్ప పండుగ బతుకమ్మ అని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు. శనివారం నెక్లెస్ రోడ్డులోని బుద్ధభవన్ కర్బలామైదానంలో ఈ నెల 10న జరిగే బతుకమ్మ పండుగ ఏర్పాట్లను వివిధ ప్రభుత్వ విభాగాల అధికారులతో కలిసి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ వేలాది మంది మహిళలు పాల్గొనే బతుకమ్మ వేడుకలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. జీహెచ్ఎంసీ ఈఈ సుదర్శన్, జలమండలి జీఎం వినోద్, శానిటేషన్ డీఈ దేవేందర్ రెడ్డి, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఉపశంకర్, టౌన్‌ప్లానింగ్ ఏసీపీ సుష్మిత తదితరులు పాల్గొన్నారు.

అన్నపూర్ణాదేవి.. నమోస్తుతే..


సనత్‌నగర్ హనుమాన్ దేవస్థానంలో కనకదుర్గాదేవి అమ్మవారు..


బేగంపేట కట్టమైసమ్మ అమ్మవారు..

సనత్‌నగర్: దేవీశరన్నవరాత్రి మహోత్సవాలతో వాడవాడలా ఆధ్యాత్మిక సందడి నెలకొంది. అమ్మవారి ఆలయాలతో పాటు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మండపాల్లో కొలువుదీరిన దుర్గామాత అమ్మవారికి విశేష పూజలు కొనసాగుతున్నాయి. ఉత్సవ కమిటీల నిర్వాహకుల ఆధ్వర్యంలో ప్రతి రోజూ సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు అలరిస్తున్నాయి. సంప్రదాయ నృత్యాలతో ఉత్సవ వేదికలు సందడిగా మారాయి. రోజుకొక అలంకారంలో అమ్మవారు దర్శనం ఇస్తూ భక్తులను కనువిందు చేస్తున్నారు. ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు, విశేష పూజల్లో భక్తజనం నిమగ్నమయ్యారు.

నూతన ఆవిష్కరణపై దృష్టిపెట్టండి: దానకిశోర్

సనత్‌నగర్: బేగంపేట సెయింట్ ఫ్రాన్సిస్ మహిళా కళాశాల 44వ గ్రాడ్యుయేషన్ డే వేడుకలు శనివారం సందడిగా జరిగింది. ముఖ్యఅతిథిగా రాష్ట్ర ప్రభుత్వ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ ముఖ్య కార్యదర్శి దానకిషోర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థినులు నూతన ఆవిష్కరణలపై దృష్టి పెట్టాలన్నారు. సామాజిక స్పృహతో అకాడమిక్ ఎక్సలెన్స్‌ను మిళితం చేసి మహిళలను ఉన్నత స్థానాలకు చేర్చేందుకు సెయింట్ థెరిస్సాచేస్తున్న కృషిని అభినందించారు. ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ, స్వర్ణోజ్వాల పథకం వంటి కార్యక్రమాల ద్వారా ప్రతి ఏడాది ఐదుగురు విద్యార్థులకు ఉచిత విద్యను అందించడం శుభపరిణామం అన్నారు. కాగా వివిధ అంశాల్లో ప్రతిభ చాటిన విద్యార్థినులకు 40 బంగారు పతకాలను అందజేశారు. అలాగే 988 మంది విద్యార్థులు గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్లు అందుకున్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఉమాజోసఫ్ తదితరులు పాల్గొన్నారు.

డీఎస్సీలో బీసీలకు అన్యాయం

ఉస్మానియా యూనివర్సిటీ: డీఎస్సీ టీచర్ ఉద్యోగాల్లో బీసీలకు అన్యాయం జరిగిందని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం ఆయన ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఎదుట మాట్లాడుతూ.. 55 శాతం గల బీసీలకు 27 శాతం రిజర్వేషన్లు 6 శాతం జనాభ గల ఓసీలకు 10 ఈడబ్ల్యూసీ రిజర్వేషన్లు అమలు చేయడం వలన ఎస్సీ, ఎస్టీ, బీసీలకు అన్యాయం జరుగుతుందన్నారు. ఈడబ్ల్యూసీ రిజర్వేషన్లను పునసమీక్ష చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీసీ విద్యార్థులు లింగయ్యయాదవ్, టీఎస్ఏ అధ్యక్షులు శ్రీకాంత్‌యాదవ్, విజయ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

లాలాపేటలో డీజే బంద్ చేయించిన పోలీసులు

లాలాపేట: లాలాపేటలోని ప్రొ జయశంకర్ స్టేడియంలో 'నవ్ మహోత్సవ్' పేరుతో శనివారం సాయంత్రం అన్‌లిమిటెడ్ డ్యాన్స్ విత్ డీజే కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో అధిక శబ్దంతో డీజే స్థానికులను ఇబ్బందులకు గురిచేసింది. దీంతో స్థానికులు పోలీసులకు ఫిర్యాదుచేయగా లాలాగూడ పోలీసులు డీజేను బంద్ చేయించారు. ఇదిలా ఉండగా డీజే బంద్ చేయించినా స్పీకర్ల సౌండ్‌తో ఆ ప్రాంతం దద్దరిల్లింది.

బీజేపీ సభ్యత్వ నమోదుకు విశేష స్పందన

చిలకలగూడ : బీజేపీ సభ్యత్వ నమోదుకు విశేష స్పందన లభిస్తోందని, హైదరాబాద్ జిల్లాలో సికింద్రాబాద్ నియోజకవర్గం మొదటి స్థానంలో ఉందని బీజేపీ సికింద్రాబాద్ మహంకాళి జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి అన్నారు. ఓబీసీ రాష్ట్ర కోశాధికారి ఆకారం రమేష్ నేతృత్వంలో చిలకలగూడ గాంధీ చౌక్ వద్ద శనివారం బీజేపీ సభ్యత్వ నమోదు శిబిరం నిర్వహించారు. రాష్ట్ర ఓబీసీ ప్రధాన కార్యదర్శి నందనం దివాకర్, సంజయ్, ఓబీసీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసయాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి మేకలసారంగపాణిలు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. నాయకులు, కార్యకర్తల సహకారంతో త్వరలోనే 60 వేల సభ్యత్వ నమోదు పూర్తి చేస్తామన్నారు. దేశ ప్రధాని నరేంద్రమోదీ ఆశయాలకు అనుగుణంగా పెద్దసంఖ్యలో ప్రజలను బీజేపీలో చేర్పించి తెలంగాణలో కాషాయజెండా ఎగురవేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సభ్యత్వ కన్వీనర్ కనకట్ల హరి, నియోజకవర్గ కన్వీనర్ నాగేశ్వరరెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవిప్రసాద్‌గౌడ్, నాయకులు మద్దెల శ్యామ్‌సుందర్, రాజేశ్వరరావు, హనుమంతు, ప్రభుగుప్తా, శారద, మల్లేష్, అనిత, దేవుడుకుమార్, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.


చిలకలగూడలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం